క్లుప్తంగా

సత్తాచాటిన విద్యార్థి



జి.సిగడాం: మండలంలోని దవళపేట ఎంపీపీ పాఠశాలలో 4వ తరగతి చదువుతున్న కేత వంశీ ఎస్‌ఎం పురం గురుకుల విద్యాలయానికి నిర్వహించిన ప్రవేశ పరీక్షలో సత్తాచాటాడు. దీంతో అతడిని పాఠశాల హెచ్‌ఎం ఎం.దేశన్న, తల్లిదండ్రులు నారాయణరావు, కుమారి, గ్రామస్తులు అభినందించారు.

అంబాభవానీకి చల్లదనం



ఆలయ నూతన కమిటీ సభ్యులు

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని రంగిరీజువీధిలో ఉన్న అంబాభవానీ ఆలయంలో మంగళవారం రాత్రి చల్లదనం ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ముందుగా అమ్మవారికి భక్తులు పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడుగా ఎస్.నాగరాజు, ఉపాధ్యక్షులుగా బి.శ్రీనివాసరావు(రాజు), గౌరవాధ్యక్షులుగా గుజ్జూరు ఆనంద ప్రసాద్, దేవత్రాసె జనార్దనరావు, సెక్రటరీగా పతంగె ఆనంద స్వరూప్, జాయింట్ సెక్రటరీగా బాసుటగర్ చంద్రశేఖర్, ట్రజరర్‌లుగా కంభాయతుఫర్, వి.వి.ఎస్.ఎస్.ఎన్.కుమార్‌రావు, సభ్యులుగా పతంగే జోగారావు, కె.విఠల్‌రావు, బి.షణ్ముఖరావు, బి.సురేష్, కె.జనార్దనరావు, డి.సంతోష్‌కుమార్‌లను ఎన్నుకున్నారు. ఆలయ అభివృద్ధికి అందరూ సహకరించాలని కోరారు.

ముత్యాలమ్మతల్లి ఉత్సవాలకు వేళాయె



ముత్యాలమ్మతల్లి

శ్రీకాకుళం కల్చరల్: శ్రీకాకుళం గ్రామ దేవత ముత్యాలమ్మతల్లి పండుగ మహోత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నట్లు కమిటీ ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా గురువారం పట్టణంలోని గీతాంజలి స్కూల్ సమీపంలోని మరిడమ్మతల్లి ఆలయం వద్ద భారీ ఊరేగింపు జరుగుతుందన్నారు. 20న ముత్యాలమ్మతల్లికి ఉపవాసం చెప్పడం, దేవరను తిప్పనున్నట్లు పేర్కొన్నారు. 21న ప్రతి ఇంటి నుంచి పసుపు, కుంకుమ, ముర్రాటలతో తల్లికి చల్లదనం చేస్తారన్నారు. 22 నుంచి 27వ తేదీ వరకు ఆలయ దమ్మల అర్చకులతో గ్రామంలో ఘటాల ఊరేగింపు, 28న అమ్మవారి అనుపు సంబర ఉత్సవం జరుగుతుందని వివరించారు.

వెంకన్న కల్యాణానికి పందిరిరాట



పందిరిరాట వేస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: తమ్మినాయుడుపేటలోని చంద్రమౌళీశ్వరస్వామి దేవాలయంలో శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవాలకు పందిరిరాట మహోత్సవం బుధవారం జరిగింది. ఈనెల 18న వైశాఖ శుద్ధ ఏకాదశిని పురస్కరించుకొని వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ ధర్మకర్త సాగి శ్రీనివాసరాజు వర్మ దంపతులు ఆధ్వర్యంలో ప్రధాన అర్చకులు శ్రీపాద సురేష్‌శర్మ వేద మంత్రాల నడుమ పందిరిరాట ఉత్సవాన్ని పూర్తిచేశారు. కార్యక్రమంలో సహ అర్చకులు నవీన్ శర్మ, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఘనంగా షిర్డీసాయి తిరువీధి



షిర్డీసాయినాథుని తిరువీధి ఉత్సవం

బలగలోని షిర్డీసాయి మందిరం 22వ వార్షికోత్సవం సందర్భంగా పురవీధులలో తిరువీధి ఉత్సవం ఘనంగా బుధవారం నిర్వహించారు. ముందుగా సాయి విగ్రహానికి పాలాభిషేకం, నూతన వస్త్రధారణ, పుష్పాలంకరణ చేశారు. విష్ణు సహస్రనామ పారాయణలు సామూహికంగా జరిగాయి. సాయంత్రం షిర్డీసాయి మందిరం నుంచి 108 కలశాలతో బాబావారి ఉత్సవ మూర్తితో కలసి భజన బృందం, మేళతాళాలతో తిరువీధి ఉత్సవం జరిపారు. అధికసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

–శ్రీకాకుళం కల్చరల్

● ఎండా.. వానా



మధ్యాహ్నం నిర్మానుష్యంగా శ్రీకాకుళం-రాజాం ప్రధాన రహదారి

సూర్యుడి ప్రతాపానికి మూగ జీవాలతోపాటు ప్రజలు విలవిలలాడారు. బుధవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు వేడి గాలులు వీయడంతో తీవ్ర ఉక్కపోతకు గురయ్యారు. అయితే మధ్యాహ్నం 2..30 గంటలకు మేఘాలు కమ్ముకుని చల్లని వాతావరణం నెలకుంది. సాయంత్రం 5 గంటలకు వర్షం కురియడంతో ప్రజలు ఉపశమనం పొందారు.

– జి.సిగడాం



చెట్టుపొదిలాం - మధుపాం గ్రామాల మధ్య చెట్లు కింద సేదతీరుతున్న ఉపాధి వేతనదారులు



కమ్ముకున్న మేఘాలు



సాయంత్రం కురుస్తున్న వర్షం

ప్రకృతి సాగు.. బహు బాగు

- ప్రకృతి సేద్యంపై పెరుగుతున్న ఆసక్తి
- తక్కువ పెట్టుబడితో అదనపు ఆదాయం
- ఆరోగ్యకర ఉత్పత్తులకు ప్రజల్లో ఆదరణ



ఘన జీవామృతాన్ని తయారు చేస్తున్న మహిళలు



ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన పంటలు



ద్రవ జీవామృతాన్ని తయారు చేస్తున్న రైతులు



కషాయాలను నిల్వ చేస్తున్న రైతులు

ఎచ్చెర్ల: మండలంలోని ప్రకృతి వ్యవసాయం జోరందుకుంది. ఆరోగ్యకరమైన ఆహార ఉత్పత్తులను ప్రజలకు అందించడానికి, భూముల సారాన్ని పరిరక్షించడానికి ప్రభుత్వం ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తోంది. దీంతో ప్రకృతి వ్యవసాయం సాగు విస్తీర్ణం గతేడాది కంటే 984 ఎకరాలు పెరిగింది. ప్రకృతి వ్యవసాయం సాగు వల్ల ఖర్చులు తగ్గడం, దిగుబడులు పెరగడంతో రైతులు ఆసక్తి చూపుతున్నారు.

పెరుగుతున్న సాగు విస్తీర్ణం

ప్రస్తుతం 22 గ్రామ పంచాయతీల్లో ప్రకృతి వ్యవసాయం చేస్తున్నారు. గతేడాది 2,926 ఎకరాల్లో సాగు చేపట్టారు. ఈ ఏడాది 3,910 ఎకరాల్లో సాగుచేస్తున్నారు. ముమ్ముందు ఈ విస్తీర్ణం ఇంకా పెరగనుంది. స్వయం సహాయక సంఘాల్లోని సభ్య రైతులతో పాటు ఇతర రైతులు కూడా ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించారు. మండలంలోని కేశవరావుపేట, ఫరీదుపేట, ఎస్‌ఎంపురం, ధర్మవరం, పొన్నాడ, తమ్మినాడుపేట, కొత్తపేట, కొంగరాం తదితర ప్రాంతాల్లో ఎక్కువగా సాగుచేస్తున్నారు. వీరంతా దాదాపు సన్న, చిన్నకారు రైతులే. ఆకు కూరలు, కూరగాయలు, బొప్పాయి, నిమ్మ, మామిడి, జీడిమామిడి, వరి తదితర పంటలను ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో సాగుచేస్తున్నారు.

సహజ ఎరువులు

పంటల సాగుకు ప్రకృతి సిద్ధంగా లభించే పదార్థాలు, ద్రవాలతో తయారుచేసిన ఎరువులు, క్రిమి సంహారక కషాయాలను వినియోగిస్తున్నారు. రసాయనిక ఎరువుల కంటే ఇవి తక్కువ ధరకు లభిస్తుండడంతో వీటిపై దృష్టి నిలిపారు. జీడిమామిడి పూతలపై పురుగుల నివారణకు, పూత నిలవడానికి మజ్జిగ, ఇంగువ, బెల్లం మిశ్రమ ద్రావణాన్ని, ఎరువుగా వాడటానికి ఆవుపేడ, బెల్లం, పప్పు దినుసుల పిండి, తగినంత గోమూత్రాన్ని కలిపి మిశ్రమంగా తయారుచేసిన ఉండలను పంటలకు ఎరువుగా వాడుతున్నారు. అలాగే వీటికి నీటిని కలిపి తయారుచేసిన ద్రవ జీవామృతాన్ని పంటలపై చీడ, పీడల నివారణకు, పంట బలంగా ఎదిగేందుకు వినియోగిస్తున్నారు. అగ్గితెగులు నివారణకు మారేడు కషాయం, వరిలో సుడిదోమ నివారణకు రేడియో మొక్కల ఆకులతో తయారుచేసిన కషాయం, వైరస్ నివారణకు పేడ కషాయం, పురుగుల నివారణకు నీమాస్త్రం, బ్రహ్మాస్త్రం, అగ్నిఅస్త్రం వంటి కషాయాలను వినియోగిస్తూ పంటలను పండిస్తున్నారు. వీటిని కొందరు రైతులు స్వయంగా తయారు చేసుకుంటున్నారు. మరికొందరు ఆయా గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయం వారు ఏర్పాటుచేసిన మినీ దుకాణాల ద్వారా కొనుగోలు చేసుకుని వ్యవసాయానికి వినియోగిస్తున్నారు.

భూములు సారవంతం



ప్రకృతి వ్యవసాయం వలన భూములు సారవంతమవుతున్నాయి. తక్కువ ఖర్చుతో ఆరోగ్యకరమైన ఆకు కూరలు సాగవుతున్నాయి. పట్టణం, దూర ప్రాంతాల నుంచి మా గ్రామాల మీదుగా వెళ్లేవారు ఇక్కడ వ్యవసాయ ఉత్పత్తుల కొనుగోలుకు ఆసక్తి చూపుతన్నారు. దీంతో సాగుతో ఆశించిన రాబడి వస్తోంది.

– గొలివి రామకృష్ణ, గొలివివానిపేట

అంతరపంటతో అదనపు ఆదాయం



బొప్పాయి, ముల్లంగి పంటలను ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పెంచుతున్నాము. ఇవి ఏపుగా ఎదిగాయి. ఫలసాయానికి వచ్చేలోగా అదనపు ఆదాయం కోసం అంతర్ పంటలుగా కూరగాయలు, ఆకుకూరలు సాగు చేపట్టాం. ఇవికూడా ఏపుగా ఎదిగి విక్రయానికి సిద్ధమవుతున్నాయి.

– సూర అప్పన్న, రైతు, కేశవరావుపేట

పూర్తిస్థాయి ప్రకృతి వ్యవసాయానికి కృషి



మండలంలోని 22 పంచాయతీల్లో ప్రకృతి వ్యవసాయ సాగు చేస్తున్నారు. మిగిలిన వారు పాక్షికంగా ప్రకృతి వ్యవసాయ పద్ధతులను పాటించి వ్యవసాయం చేస్తున్నారు. పూర్తిస్థాయిలో ప్రకృతి వ్యవసాయానికి కృషి చేస్తున్నాం. రైతుల్లో నమ్మకం పెరగటం వలన గతేడాది కంటే ఈసారి సాగు విస్తీర్ణం పెరిగింది.

– సీహెచ్ సూర్యనారాయణ, ఎస్‌డీఏ, ప్రకృతి వ్యవసాయం

మార్కెట్ విస్తరణతో రైతుల ఆసక్తి

మండలంలోని గ్రామాల్లో ప్రకృతి సిద్ధంగా పండిన పంటల గురించి తెలుసుకుని, ఇతర ప్రాంతాల ప్రజలు ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ద్వారా ఉత్పత్తులను కొనుగోలు చేసి తీసుకెళ్తున్నారు. దీంతో రైతులు తమ ఉత్పత్తులకు మార్కెట్ లభిస్తోందని ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మరింత మంది ప్రకృతి వ్యవసాయానికి మొగ్గు చూపేలా వెలుగు, ప్రకృతి వ్యయసాయ విభాగం అధికారులు, సిబ్బంది గ్రామాల్లో అవగాహన ర్యాలీలు, సమావేశాలను నిర్వహించి సాగును ప్రోత్సహిస్తున్నారు. దీంతో మరింత మంది రైతులు ఆసక్తి చూపుతున్నారు.

'ఖరీఫ్ సీజన్‌పై దృష్టి సారించాలి'



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ చిరంజీవి

ఎచ్చెర్ల క్యాంపస్: రానున్న ఖరీఫ్ సీజన్‌పై వ్యవసాయ శాఖ సిబ్బంది ప్రత్యేక దృష్టి పెట్టాలని ఎచ్చెర్ల ఎంపీపీ మొదలవలస చిరంజీవి సూచించారు. ఎచ్చెర్ల మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు శాఖలపై సమీక్షలు చేపట్టారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా సకాలంలో విత్తనాలు, ఎరువులు అందజేయాలని, శతశాతం ఈ క్రాపింగ్ చేయాలని సభ్యులు సూచించారు. జలజీవన్ మిషన్ కార్యక్రమంలో భాగంగా నిలిచిపోయిన పనులు పునరుద్ధరించాలని, ప్రతి ఇంటికీ కుళాయిలు ఏర్పాటు చేసి మంచినీరు అందేలా చర్యలు తీసుకోవాలని సభ్యులు సభ దృష్టికి తీసుకొచ్చారు. ఆరోగ్య సిబ్బంది మాట్లాడుతూ గ్రామాల్లో టీబీ వ్యాధిపై ప్రత్యేకంగా స్క్రీనింగ్ టెస్టులు నిర్వహిస్తున్నట్లు వివరించారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిరంతరం గ్రామాల్లో నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఉపాధి హామీ పథకం పనులు సక్రమంగా నిర్వహించాలని, వేసవి నేపథ్యంలో ఎండల రక్షణకు చర్యలు తీసుకోవాలని, గరిష్ఠ వేతనాలు లభించేలా చర్యలు తీసుకోవాలని సభ్యులు సూచించారు. పూర్తిస్థాయి పని దినాలు జాబ్ కార్డు ఉన్నవారికి కల్పించాలని చెప్పారు. పారిశుధ్యం, వీధి దీపాల నిర్వహణకు అధికారులు సహకరించాలని కోరారు. నారాయణపురం కుడికాలువ పూడికలు తీయాలని, ఖరీఫ్‌లో సాగునీరు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో ఎంపీడీవో రమాదేవి, పరిపాలన అధికారి పూజారి వెంకట సత్యరామ్మోహన్, సీనియర్ అసిస్టెంట్ కల్లారి రామ్మోహన్‌రావు పాల్గొన్నారు.

సాయికుమార్ పరామర్శ



సన్యాసి కుటుంబాన్ని పరామర్శిస్తున్న సాయికుమార్

రణస్థలం: మండలంలోని కొచ్చెర్ల పంచాయతీ కొమరవానిపేట గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు మూగి సన్యాసి తల్లి ఇటీవల మృతి చెందారు. అలాగే పైడి భీమవరంలోని చింతపల్లి చిన్న బంధువులు మరణించడంతో వాళ్ల కుటుంబాలకు వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పిన్నింటి సాయికుమార్ బుధవారం పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయనతో పాటు నాయకులు రెడ్డి దాలినాయుడు, పిళ్ల ఆనందరావు పాత్రుడు, మీసాల దాలినాయుడు, చిల్ల వెంకటరెడ్డి, చుక్క వెంకటరమణ, కోనేటి రాజు, మూగి రామారావు, కోమర శివ, మూగి సత్యం తదితరులు ఉన్నారు.

నియోజకవర్గ ప్రజలకు ధర్మాన కృతజ్ఞతలు



ధర్మాన ప్రసాదరావు

శ్రీకాకుళం రూరల్: ఈనెల 13వ తేదీన జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో శ్రీకాకుళం నియోజకవర్గ ప్రజంతా పెద్ద ఎత్తున ఓటింగ్ ప్రక్రియలో పాల్గొని ప్రజాస్వామ్యానికి వన్నెతెచ్చారని మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. ఈ మేరకు బుధవారం క్యాంప్ కార్యాలయం నుంచి ఒక వీడియో సందేశాన్ని విడుదల చేశారు. శ్రీకాకుళం నియోజకవర్గం తరఫున ఓటింగ్‌లో పాల్గొన్న వారందరికీ ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేశారు.

ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పించండి

- కొత్తపల్లి పాఠశాల ఉపాధ్యాయుల ఇంటింటా ప్రచారం

కాశీబుగ్గ: పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని మందస మండలంలోని కొత్తపల్లి ప్రాథమిక ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు. పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు ఎస్.గణేశ్వరరావు నేతృత్వంలోని ఉపాధ్యాయ బృందం ముకుందపురం తదితర గ్రామాల్లో బుధవారం పర్యటించి పిల్లలను తమ పాఠశాలలో చేర్పించాలని కోరుతూ ఇంటింటా ప్రచారం చేశారు. పిల్లల తల్లిదండ్రులను కలిసి ప్రభుత్వ పాఠశాలో చదువుతున్న విద్యార్థుల ప్రతిభను వివరించారు. పాఠశాలలో పూర్తిస్థాయిలో ఉపాధ్యాయులు ఉన్నారని, మౌలిక వసతులు బాగున్నాయని తెలియజేశారు. ఉపాధ్యాయులు గవ్వ భీమారావు, మజ్జి చిత్రసేను, బోనెల రమేష్ ఉన్నారు.

వైభవంగా గ్రామదేవత ఉత్సవాలు

- ప్రత్యేక ఆకర్షణగా ఉత్సవ విగ్రహాలు



అసిరిపోలమ్మను ఊరేగిస్తున్న దృశ్యం

ఇచ్ఛాపురం రూరల్: మండలంలోని కమళాయిపుట్టుగ-లండపుట్టుగ గ్రామాల్లో గ్రామదేవత ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. అసిరిపోలమ్మ గ్రామ దేవత ఉత్సవాల్లో ఒడిశా కళాకారులు తయారు చేసిన ఉత్సవ విగ్రహాలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. వీధుల్లోని ముఖ్య కూడలిల్లో ఏర్పాటు చేసిన ఈ విగ్రహాలను ఉత్సవాలకు వచ్చిన భక్తులు సందర్శిస్తున్నారు. సంబరాల్లో భాగంగా బుధవారం పొందూరుకు చెందిన మహిళల కోలాటం, ఒడిశాకు చెందిన యువతీ, యువకుల గారడీ విన్యాసాలు అందరినీ అలరించాయి. గ్రామదేవతను ప్రత్యేక పల్లకిలో అలంకరించి బొరివంక సన్నాయి మేళం మధ్య పుర వీధుల్లో ఊరేగించారు.

జిల్లాస్థాయి క్రికెట్‌టోర్నీ విజేత టెక్కలి



విజేతగా నిలిచిన టెక్కలి జట్టు క్రీడాకారులు

సంతబొమ్మాళి: మండలంలోని ఉమ్మిలాడ గ్రామంలో జరిగిన జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంటు విజేతగా టెక్కలి జట్టు నిలిచింది. బుధవారం జరిగిన ఫైనల్‌లో సున్నాపల్లి, టెక్కలి జట్లు తలపడ్డాయి. మొదటి బ్యాటింగ్ చేసిన సున్నపల్లి జట్టు 78 పరుగులు చేయగా తరువాత బ్యాటింగ్‌కు దిగిన టెక్కలి జట్టు లక్ష్యాన్ని సాధించి విజేతగా నిలిచింది. విన్నర్‌గా నిలిచి టెక్కలిజట్టుకు రూ. 50 వేల నగదు, ట్రోఫీని నిర్వాహకులు అందజేశారు.

గోవులకు పర్ణశాల ఏర్పాటు



గోవులకు ఏర్పాటు చేసిన పర్ణశాల

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ ఏడో వార్డు చినబడం గ్రామం శివారు ప్రాంతం పాతజాతీయ రహదారి పక్కన ఉన్న గోసంరక్షణ కేంద్రంలో పర్ణశాలను ఏర్పాటు చేశారు. దాతల సాయంతో నడుస్తున్న గోశాల వద్ద ఆవులు వేసవితాపానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్న విషయాన్ని తెలుసుకున్న తో దాతలు పర్ణశాల ఏర్పాటుకు ముందుకొచ్చారు. తొమ్మిది వేల రూపాయలతో దీన్ని ఏర్పాటు చేశారు. ఎదురు కర్రలతో పందిళ్లు వేసి సొప్పగడ్డితోనేసి గోవులకు నీడను కల్పించారని నిర్వాహకులు లక్కోజి ధర్మారావు తెలిపారు. గోవుల సంరక్షణకు ముందుకు వచ్చిన దాతలు, సేవకు హాజరైన వారి కృతజ్ఞతలు తెలియజేశారు.

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

అరసవల్లి: శ్రీకాకుళం రూరల్ మండలం కనుగులవానిపేట సబ్‌స్టేషన్ పరిధిలో ఆర్‌డీఎస్‌ఎస్ అభివృద్ధి పనులు చేపడుతున్నందున గురువారం ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పలు గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లుగా ఆపరేషన్స్ ఈఈ బయ్యన్నాయుడు బుధవారం తెలిపారు. కనుగులవానిపేట, ఇప్పిలి, బలివాడ, కుందువానిపేట, ముక్తంపాలెం, గొల్లపేట, మిత్తనపేట, కళ్లేపల్లి, పరదేశిపాలెం, బొరపేట, మోపసుబందరు, సాదుపేట, జాలరిపేట, పుక్కల్లపేట, పీజీపేట, సీహెచ్‌జీపేట, నర్సయ్యపేట, ఖాజీపేట తదితర గ్రామాలకు పైన పేర్కొన్న సమయాల్లో విద్యుత్ సరఫరా ఉండదని.. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

ఎచ్చెర్ల @ నంబర్ 1

ఎచ్చెర్ల క్యాంపస్: సార్వత్రిక ఎన్నికల పోలింగ్‌లో ఎచ్చెర్ల నియోజకవర్గం జిల్లాలో మొదటి స్థానంలో నిలిచింది. ఈ నెల 13న ఎన్నికలు జరగ్గా, రాత్రి 10 గంటల వరకు సైతం ఓటర్లు ఓటుహక్కు వినియోగించుకున్నారు. నియోజకవర్గంలో 83.28 శాతం పోలింగ్ నమోదు అయ్యింది. మొత్తం ఓట్లు 2,44,760 కాగా, 2,03,831 నమోదయ్యాయి. పురుషులు 1,02,681, మహిళలు 1,01,147 మంది ఓటుహక్కు వినియోగించుకున్నారు. కాగా 2014లో 82.07, 2019లో 84.19 శాతం పోలింగ్ నమోదయ్యింది.